క్లుప్తంగా

11న 'సాక్షి' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని అపురూప కాలనీలో ×సాక్షి ఆధ్వర్యంలో టీవీఆర్ మోడల్ హైస్కూల్ సౌజన్యంతో ఈ నెల 11న సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు పోటీలు జరుగుతాయి. ఔత్సాహికులు ఎవరి ముగ్గులు వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గులకు ప్రాధాన్యత ఉంటుంది. ఉత్తమ ముగ్గులు వేసిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సలేషన్ బహుమతులు ఉంటాయి. వివరాలకు 7993839360 నెంబరులో సంప్రదించగలరు.

దర్గాను సందర్శించిన మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని జీతేపీర్ బాబా దర్గాలో ఆదివారం నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 20వ డివిజన్ కార్పొరేటర్ బాలాజీనాయక్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా జోసెఫ్



జోసెఫ్‌ను అభినందిస్తున్న సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా జోసెఫ్ (ఏసు) ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో జోసెఫ్‌కు 584 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి అచ్చిబాబుకు 159 ఓట్లు వచ్చాయి. దీంతో 426 ఓట్ల భారీ మెజార్టీతో జోసెఫ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని, తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని పేర్కొన్నారు.

గోపాల్‌నగర్‌లో 5కే రన్



రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ గోపాల్‌నగర్‌లో ఆదివారం 5కే రన్ నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించే విధంగా ఇలాంటి కార్యక్రమం చేపట్టిన నిర్వాహకులు అజయ్ సునీల్, కాలనీ వాసులను ఆయన అభినందించారు. నిత్యం ప్రతి ఒక్కరూ ఒక గంట వ్యాయామం చేస్తే వారికి ఎటువంటి అనారోగ్య సమస్యలు రావన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో క్రీడలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, గోపాల్‌నగర్‌లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని ఆయన అన్నారు. ఓపెన్ జిమ్‌లు, క్రీడా మైదానాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు సాయిబాబాచౌదరి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన



భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమతానగర్ కాలనీలో రైతు నేస్తం ఫౌండేషన్ సహకారంతో కర్షక సేవా కేంద్రం ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, డా.ఖాదర్‌వలీ, పాకశాస్త్ర నిపుణుడు మిల్లెట్ రాంబాబు, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిరుధాన్యాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెరగాలన్నారు. మారిన జీవన శైలికి అనుగుణంగా చిరుధాన్యాలను ఎక్కువగా వినియోగించాలని సూచించారు. సజ్జలు, జొన్నలు, రాగులు, పరిగలు వంటి వాటితో పోల్చుకుంటే కొర్రలు, ఆరికలు, సామలు, ఊదలు, అండుకొర్రలలో ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు అధికంగా అందుతాయన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, సమతానగర్ కాలనీవాసులు బాలు, శివప్రసాద్, రామకోటేశ్వరరావు, వినయ్‌బాబు, స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

'పది' టార్గెట్ 90%

- పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెరుగుదలకు ప్రత్యేక ప్రణాళిక
- 90 శాతం మంది విద్యార్థులు పాస్ కావడమే లక్ష్యం
- నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలపై అధికారుల ప్రత్యేక దృష్టి



దుండిగల్‌లోని జెడ్పీహెచ్ స్కూల్

దుండిగల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచే దిశగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కసరత్తు చేస్తున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ లక్ష్య సాధన దిశగా ఉపాధ్యాయులు ముందుకెళ్తున్నారు. పాఠ్యాంశాల్లో ఉన్న ప్రతి అంశం విద్యార్థికి ఏ మేర బోధపడుతుందో తెలుసుకునేందుకు నిత్యం స్లిప్ టెస్టులు నిర్వహించడంతో పాటు పలు రకాలుగా వారి సామర్థ్యాన్ని పరీక్షిస్తున్నారు. ప్రస్తుతం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా అందులో 1,723 మంది పదవ తరగతి విద్యార్థులు ఉన్నారు.

సీసీఈ విధానం అమలు..

- 2014–15 విద్యా సంవత్సరంలో రాష్ట్ర విద్యాశాఖ నిరంతర సమగ్ర మూల్యాంకన విధానాన్ని(సీసీఈ) అమల్లోకి తీసుకువచ్చింది. విద్యార్థులు బట్టీ విధానానికి పూర్తిగా స్వస్తి పలకడమే దీని ముఖ్య ఉద్దేశం.
- గతంలో విద్యార్థులు సబ్జెక్ట్‌లో ఉన్న ప్రశ్న, జవాబులను మాత్రమే చదువుతూ బట్టీ పట్టేవారు. సీసీఈ కారణంగా ఉపాధ్యాయులు పాఠాలు చెప్పే సమయంలోనే విద్యార్థులకు ఎంత మేర పాఠం అర్థమయిందో తెలుసుకునేందుకు వారితోనే స్వయంగా ప్రశ్నలు రూపొందించి జవాబులు రాయించేవారు.
- దీంతో సదరు పాఠంపై విద్యార్థులకు పూర్తిగా అవగాహన రావడంతో పాటు పరీక్షల సమయంలో ఎలాంటి ప్రశ్నలు ఇచ్చినా సులభంగా జవాబు రాసే విధంగా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. మొదట్లో ఈ విధానం పట్ల విద్యార్థులు కొంత తడబడినా క్రమేనా పుంజుకున్నారు.

పెరుగుతున్న ఉత్తీర్ణత శాతం..

- ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం క్రమంగా పెరుగుతూ వస్తోంది. కరోనా కారణంగా గతంలో రెండు సంవత్సరాలు ఎలాంటి పరీక్షలు లేకుండానే విద్యార్థులంతా పాసయ్యారు. ఈ దఫా గతంతో పోలిస్తే ఉత్తీర్ణత శాతం పెంచేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. 2015–16లో 53 శాతం, 2016–17లో 61, 2017–18లో 65, 2018–19లో 78, 2021–22లో 66 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 90 శాతం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

40 రోజుల ప్రణాళిక..

- ఈ ఏడాది ఏప్రిల్ 3 నుంచి పరీక్షలు ప్రారంభం కానుండగా గత ఏడాది డిసెంబర్‌లోనే సిలబస్ మొత్తం పూర్తి చేశారు. అప్పటి నుంచి సిలబస్‌ను మరోసారి రివిజన్ చేయిస్తున్నారు. ఇందులో భాగంగా 40 రోజుల ప్రణాళిక రూపొందించారు. 2022 డిసెంబర్ 27 నుంచి దీనిని అమల్లోకి తీసుకువచ్చారు.
- ప్రతిరోజూ ఒక్కో సబ్జెక్టులో ఒక్కో పాఠాన్ని బోధిస్తూ రోజుకు ఒక సబ్జెక్ట్ ఎంచుకుని స్లిప్ టెస్టు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ప్రత్యేకంగా స్పెషల్ టెస్టులను సైతం నిర్వహించి విద్యార్థి ప్రతిభను అంచనా వేస్తున్నారు.
- ఆయా సబ్జెక్ట్‌ల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి మధ్యాహ్నం అదనంగా రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.
- తల్లిదండ్రులతో నిత్యం సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థుల పనితీరును వారికి వివరిస్తున్నారు.

విద్యార్థులపై స్పెషల్ ఫోకస్



పదవ తరగతి విద్యార్థులపై స్పెషల్ ఫోకస్ పెట్టాం. ప్రతి రోజూ ఒక్కో సబ్జెక్ట్‌లో స్లిప్ టెస్టు నిర్వహించి వారి సామర్థ్యాన్ని పరీక్షిస్తున్నాం. మధ్యాహ్నం వేళల్లో రెండు గంటలు అదనంగా క్లాసులు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాం.

సత్యనళిని, దుండిగల్ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు

ఉత్తీర్ణత శాతం పెరుగుతోంది



కరోనా సమయంలో మినహా మిగతా విద్యా సంవత్సరాల్లో పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెరుగుతూ వస్తోంది. ఈసారి 90 శాతం ఉత్తీర్ణత సాధించేలా లక్ష్యం ఏర్పాటు చేసుకుని పని చేస్తున్నాం. అదనపు తరగతుల నిర్వహణను నిత్యం పరిశీలిస్తున్నాం.

– అంజనేయులు, మండల విద్యాధికారి

23న హ్యాండ్‌రైటింగ్ పోటీలు

కుత్బుల్లాపూర్: జాతీయ చేతిరాత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న అమ్మ ఒడి హ్యాండ్ రైటింగ్ అండ్ క్యాలిగ్రఫీ ఇనిస్టిట్యూట్, ఆల్ ఇండియా గ్రాఫాలజీ అసోసియేషన్, హ్యాండ్‌రైటింగ్ ట్రినర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి చేతిరాత పోటీలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్ రైటింగ్ అసోసియేషన్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కార్యదర్శి షేక్ మహబూబ్ హుస్సేన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 1వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు, అందంగా రాయగల డిగ్రీ, ఇంజినీరింగ్, టీచర్ ట్రైనింగ్ వారు సైతం పాల్గొనవచ్చన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో ఇంటి వద్దనే పరీక్ష రాసి వాట్సాప్‌లో పంపాల్సి ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు 8639414376/ 9182200765 నెంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కేంద్ర మానవ వనరుల శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా మెడల్స్, బహుమతులు అందజేస్తామని షేక్ మహబూబ్ హుస్సేన్ పేర్కొన్నారు.

'నాణ్యత లోపంతోనే ప్రమాదం'



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో ఇంటి స్లాబ్ కూలి ఇద్దరు కార్మికులు మృతిచెందిన ప్రాంతాన్ని ఆదివారం కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డీసీ రవీందర్ పరిశీలించారు. నిర్మాణంలో వినియోగించిన సిమెంట్‌లో నాణ్యత లేదని, వారు వేసిన కాంక్రీట్‌ను టెస్ట్ చేయాలని డీసీ రవీందర్‌ను కార్పొరేటర్ కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, నాణ్యత పాటించని రెడీమేడ్ కాంక్రీట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యం

ఎమ్మెల్యే వివేకానంద్



గాయత్రినగర్‌లో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజలకు మెరుగైన వసతులను కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ గాయత్రి నగర్ పార్కులో రూ.11 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆదివారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం అల్వాల్‌కు చెందిన డాక్టర్ కేర్ హోమియోపతి ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎప్పుడూ లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. సేవా కార్యక్రమానికి ముందుకొచ్చిన డాక్టర్ కేర్ హోమియోపతి యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు సుమీర్‌సింగ్, సంజీవరెడ్డి, సుభాష్, శ్రీదేవి, రాజు, బ్రిజేష్ ఝూ, రామకృష్ణ, శర్మ, వార్డు సభ్యులు సుధాకర్‌గౌడ్, ఇందిరారెడ్డి పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు..

- గాజులరామారంలో నిర్వహించిన ముత్యాలమ్మ జాతరలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజయ్య, సురేష్, నర్సింహ, భిక్షపతి, పీఏసీఎస్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

సన్మానం..

- సుభాష్‌నగర్ డివిజన్ తెలుగుతల్లినగర్ 60 గజాలకు చెందిన కొండిన్య మహాముని గౌడ సంఘం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను పేట్‌బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. సంఘం ప్రెసిడెంట్ ఎం.ఎస్.గౌడ్, వైస్ ప్రెసిడెంట్లు వెంకటరమణగౌడ్, ఏడుకొండలుగౌడ్, జనరల్ సెక్రటరీ బాలకృష్ణగౌడ్, ట్రెజరర్ వెంకట సుబ్బారావుగౌడ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలకు తరలివెళ్లిన జర్నలిస్టులు

రంగారెడ్డినగర్: టీయూడబ్ల్యూజేహెచ్–143, టీజేఎఫ్, ఐజేయూ జర్నలిస్ట్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పటాన్‌చెరువులో జరిగిన 10వ ప్లీనరీ ద్వితీయ రాష్ట్ర మహాసభలకు కుత్బుల్లాపూర్‌కు చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. వెళ్లిన వారిలో టీయూడబ్ల్యూజేఎఫ్–143 రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగు వెంకటేష్‌గౌడ్, శివాజీ, ఉద్దండపురం వెంకటేష్, కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు సుధీర్ మంకల, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, కోశాధికారి సురేందర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, శివ తదితరులు వెళ్లారు.

యువకుడి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అంగడిపేట్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో నివసించే పెయింటర్ మురళి ఇంటి పక్కనే అతడి సోదరుడు నర్సింహ(19) తల్లి జయమ్మతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 7న రాత్రి 10 గంటలకు మురళి తన తమ్ముడు నర్సింహకు ఫోన్ చేయగా ఆలస్యంగా ఇంటికి వస్తానని చెప్పాడు. అయితే ఆదివారం ఉదయం నిద్ర లేచి చూడగా నర్సింహ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. కిందకు దింపి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు బహుమతులు



బహుమతులు పొందిన విద్యార్థులు

ఆల్విన్‌కాలనీ: యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన 'చిగురు' కార్యక్రమంలో ఎల్లమ్మబండకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు డ్యాన్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. దీంతో పాటు సైన్స్ ఫెయిర్‌లో ద్వితీయ బహుమతి పొందారు. ప్రధానోపాధ్యాయులు కె.రాధాపద్మజ, యూత్ ఫర్ సేవా సమన్వయకర్త అరుణ్మయి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, రాములు, సరోజ, అర్చన విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం



నిజాంపేట్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. ఆదివారం ప్రగతినగర్ 2వ డివిజన్‌లోని ధ్యానహిత స్కూల్‌లో మమత హాస్పిటల్ సహకారంతో, కార్పొరేటర్ దివాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ధన్‌రాజ్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆస్పత్రి యాజమాన్యాలు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన శిబిరంలో బీపీ, డయాబెటిస్, ఇతర సాధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో మమత హాస్పిటల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఆనంద్ బాబు, సీనియర్ మేనేజర్ ప్రమోద్‌కుమార్, హాస్పిటల్ సభ్యులు బెంజిమిన్ పాల్, పవన్‌కుమార్, నాయకులు సాంబశివారెడ్డి, దాసరి చందు తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ



చిన్నారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసిన మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సూర్యనగర్‌లోని యోధా షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో న్యూ రాజస్థాని మాలి సమాజ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన నేషనల్ లెవెల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ బహుమతుల ప్రధానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే తల్లిదండ్రులు తమ పిల్లలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. అనంతరం విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో జైసింగ్ భాటీ, వికాస్ గెహ్లాట్, హనుమాన్ కచావా, హరక్ చంద్ సంక్ల, అనిల్ భాటీ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ 9వ ఫేజులోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం వేల కోట్ల నిధులతో ఇప్పటికే కేపీహెచ్‌బీ డివిజన్‌ను అభివృద్ధి చేసిందన్నారు. అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని, బూత్‌స్థాయి కమిటీలను వెంటనే నియమించాలని సూచించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు సాయిబాబా చౌదరి, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేధా స్కూల్‌లో స్పోర్ట్స్ డే



విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

నిజాంపేట్: నిజాంపేట్‌లోని మేధా స్కూల్‌లో ఆదివారం స్పోర్ట్స్ డే వేడుకలు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు క్రీడల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. న్యూట్రీషనిస్ట్ సబంగి తమ్మాళ్వార్, ఫిట్‌నెస్ కోచ్ రాజేష్ విద్యార్థులకు ఆరోగ్యం కోసం సూచనలు ఇచ్చారు.

ఆ తొమ్మిది ఎకరాల భూమి ఏమైంది..?

బాచుపల్లి పెద్ద చెరువు కబ్జాలపై ప్రశ్నించిన బీజేపీ నేతలు

నిజాంపేట్: బాచుపల్లి పెద్ద చెరువు శిఖం భూమిలో ఏపీఆర్ ప్రాజెక్ట్ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై విచారణ చేసి చెరువును కాపాడాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ పేర్కొన్నారు. ఆదివారం బాచుపల్లి పెద్ద చెరువును బీజేపీ నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. రెవెన్యూ రికార్డుల్లో 42.28 ఎకరాలు ఉండగా, ఇరిగేషన్ రికార్డుల్లో 33.21 ఎకరాల్లో పెద్ద చెరువు విస్తరించి ఉందని, తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమి ఏమైందో అధికారుల వద్ద రికార్డులు లేవన్నారు. సర్వే నెంబరు 66, 67, 68, 69లలో ఏపీఆర్ ప్రాజెక్స్ యాజమాన్యం విల్లాల నిర్మాణం కోసం అనుమతి తీసుకుని పెద్ద చెరువు బఫర్ జోన్‌లో మట్టితో పూడ్చి ఏకంగా నాలుగు ఎకరాలు ఆక్రమించారన్నారు. చెరువు శిఖం భూమికి ఆనుకుని నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో తప్పనిసరిగా ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్‌ఓసీ పొందాల్సి ఉంటుందని, అయితే కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం అడ్డదారుల్లో హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు పొందిందని ఆరోపించారు. బఫర్ జోన్ ఆక్రమణలపై రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చోద్యం చూడడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సర్వే నెంబర్లు 66, 67, 68, 69లలో రెవెన్యూ పహాని ప్రకారం 14 ఎకరాల 19 గుంటలే చూపిస్తుందని, ఏపీఆర్ ప్రాజెక్టుకి 15.26 ఎకరాల్లో అనుమతులు ఏ విధంగా ఇచ్చారని ప్రశ్నించారు. చెరువు ఆక్రమణలపై అధికారులు విచారణ జరిపి ఏపీఆర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో నిజాంపేట్ కార్పొరేషన్ పార్లమెంట్ కో కన్వీనర్ డాక్టర్ రాజు, ప్రధాన కార్యదర్శి గొల్లకృష్ణ, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ట్రేడర్ సెల్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మురళి, రామ్‌రెడ్డి, లక్ష్మయ్య, తిలోక్ తదితరులు పాల్గొన్నారు.



బాచుపల్లి పెద్ద చెరువును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

సందడిగా ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాధవి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్‌లోని ఎస్ఆర్‌నాయక్ నగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో శిరీష మొదటి బహుమతి, జ్యోతి ద్వితీయ, దేదీప్య తృతీయ బహుమతి గెలుపొందగా వారికి సురేష్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి అంటేనే ముగ్గుల పండుగ అని, మన సాంప్రదాయాలకు పండుగలు ప్రతీకగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ టి.టి.కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, కోశాధికారి అజయ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

డీ పోచంపల్లిలో..

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ డీ పోచంపల్లిలో ఆదివారం బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్, శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాధవి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు ప్రజల సాంప్రదాయలకు పండుగలు ప్రతీక అన్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు విజయలక్ష్మి, అసెంబ్లీ కోకన్వీనర్ రాముగౌడ్, జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి, కృష్ణారెడ్డి, విజయ్, మల్లేశ్వరి, రోజా, ఆకుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.